క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



సి.బెళగల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఎంపీడీఓ శకుంతల, మండల అధికారులు పరిశీలించారు. కేంద్రాల్లో ర్యాంప్, విద్యుత్ వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్వోలకు సూచించారు. ఆమె వెంట వీఆర్వోలు శేఖర్, లింగేష్, సాయిరమణ, శ్రీనివాసులు ఉన్నారు.

కేంద్రాల్లో సకల సౌకర్యాలు



కల్లూరు అర్బన్ పోలింగ్ కేంద్రం

కల్లూరు: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులు అధికారులు కల్పించారు. పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 357 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కల్లూరు మండలంలోని గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో 214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు కేటాయించిన ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. ఓటర్లు ప్రశాంతంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల దగ్గర చల్లువ పందిళ్లు ఏర్పాటు చేసి తాగునీటి వసతి కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

భక్తిశ్రద్ధలతో చందన యాత్ర ఉత్సవాలు



జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో ఆదివారం జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు –2024 అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

7 గంటలకు పోలింగ్ మొదలు కావాలి

- ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు (సెంట్రల్) : నేటి (సోమవారం)ఉదయం 7 గంటలకు పోలింగ్ ఖచ్చితంగా మొదలు కావాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి పోలింగ్ సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎంపీడీఓ, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్ మొదలు పెట్టి 6:30 గంటలకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మాక్ పోల్‌లోని ఓట్లను తొలగించి 6:45కు కంపార్ట్‌మెంట్లలో మిషన్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సెక్టార్ ఆఫీసర్లు ఆదివారం రాత్రి అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి పోలింగ్ స్టేషన్ ఈవీఎం ఎలా కనెక్ట్ చేయాలి, మాక్ పోల్ నిర్వహణపై వీడియోలు చూసి రిఫ్రెష్ అయ్యేలా పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు నేటి ఉదయం 7 గంటలకే అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి అన్ని మిషన్లు పనిచేస్తున్నాయా లేదా అని తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్ఓ, ఏఆర్ఓ, సెక్టార్ ఆఫీసర్లు ఏదో ఒక పోలింగ్ స్టేషన్‌లో మాక్ పోల్‌కు హాజరు కావాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతానికి సంబంధించిన నివేదికలను పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ నిర్వహణలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

చెట్టు విలువ!



చెట్టు కింద సేదతీరుతున్న మేకలు, పొట్టేళ్లు

మహానంది: మండుతున్న ఎండలకు జనం అల్లాడుతున్నారు. చెట్లను ఇష్టానుసారం నరికివేడంతో పర్యావరణం దెబ్బతినడంతో వేసవి తాపం ఎక్కువైంది. పొలాల్లో మేతకు వెళ్లిన గొర్రెల మంద ఎండలకు తట్టుకోలేక గుంపుగా ఓ చెట్టు కింద సేదతీరుతున్న దృశ్యం చెట్టు విలువను చెప్పకనే చెబుతుంది. మహానంది సమీపంలో దృశ్యం కనిపించింది.

పోలింగ్‌కు వేళాయె

- నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్న 2.46 లక్షల మంది ఓటర్లు
- 32 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత
- పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లిన సిబ్బంది, ఈవీఎంలు
- కోడుమూరు నియోజకవర్గ బరిలో 14 మంది అభ్యర్థులు



సిల్వర్‌జూబ్లీ కళాశాలలో పోలింగ్ సామగ్రి తీసుకుంటున్న కోడుమూరు నియోజకవర్గ ఎన్నికల సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ బరిలో ఉన్న 14 మంది అభ్యర్థుల భవితవ్యంపై తీర్పు ఇవ్వడానికి ఓటర్లు సిద్ధమయ్యారు. మరి కొన్ని గంటల్లో పోలింగ్ ప్రారంభం కానుంది. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వకు పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని పటిష్టమైన ప్రజాస్వామ్యం కోసం పాటుపడాలని అధికారులు కోరుతున్నారు

పటిష్టమైన బందోబస్తు

నియోజకవర్గంలో 2,46,632 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరూ ఓటు హక్కు వినియోగం కోసం 275 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 30 సమస్యాత్మక 2 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఈ నేపథ్యంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 64 మంది మైక్రో అబ్జర్వర్లతోపాటు వీడియోగ్రఫీ తీయిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. పారామిలటరీ బలగాలతో పహారా కాస్తున్నారు. పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు

నియోజకవర్గానికి సంబంధించి డిస్పాచ్ సెంటర్‌ను కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి పోలింగ్ సామగ్రి,

నియోజకవర్గంలో ఓటర్లు	2,46,632 మంది
బరిలో ఉన్న అభ్యర్థులు	14
పోలింగ్ కేంద్రాలు	275
సమస్యాత్మక కేంద్రాలు	30
అత్యంత సమస్యాత్మక	02
మైక్రో అబ్జర్వర్లు	64
పోలింగ్ సమయం	ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు

సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. కోడుమూరు నియోజకవర్గ ఆర్వో/కర్నూలు ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన ఈవీఎంలను స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం తరువాత తమకు కేటాయించిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. కాగా నియోజకవర్గానికి 325 బ్యాలెట్, 328 కంట్రోల్ యూనిట్లు, 346 వీవీ ప్యాట్లను కేటాయించారు. ఎన్నికలు ముగిసిన తరువాత ఈవీఎంలను కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు తరలిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచి జూన్ 4వ తేదీ కౌంటింగ్ చేపడతారు.



ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తున్న సిబ్బంది

బరిలో 14 మంది పోటీ

కోడుమూరు నియోజకవర్గం నుంచి మొత్తం 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి డాక్టర్ ఆదిమూలపు సతీస్, టీడీపీ నుంచి బొగ్గుల దస్తగిరి, కాంగ్రెస్ నుంచి పి.మురళీకృష్ణతో పాటు మరో 11 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే పోటీ ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన 2014, 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులే విజయదుందుభి మోగించారు. ఈసారి కూడా ట్రెండ్ స్పష్టంగా వైఎస్సార్‌సీపీ వైపే కనిపిస్తుండడంతో ప్రత్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడానికి తెర తీశారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం



జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్‌లో ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్న ఆర్వో నారపురెడ్డి మౌర్య

- పాణ్యం నియోజకవర్గంలో 3,31,706 మంది ఓటర్లు
- బరిలో 14 మంది అభ్యర్థులు
- 357 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ, నంద్యాల ఎంపీ స్థానాల పోలింగ్ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి మధ్య ఉండనుంది.

పోలింగ్‌కు కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది

నియోజకవర్గంలో మొత్తం 3,31,706 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 357 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రత్యేకంగా ర్యాంపులు, వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. అలాగే తాగునీరు, నిరంతర విద్యుత్, టాయిలెట్లు, బాత్‌రూమ్‌లను ఓటర్లు, సిబ్బందికి అనుకూలంగా ఏర్పాటు చేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని ఆదివారం మధ్యాహ్నం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సుమారు 1600 మంది సిబ్బందితో పాటు 425 బ్యాలెట్, 425 కంట్రోల్ యూనిట్లు, 456 వీవీప్యాట్లు కేటాయించారు. వీటిని సిబ్బంది తమతోపాటు తీసుకుని ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడ సోమవారం ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు మాక్ పోలింగ్‌ను రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహిస్తారు. అనంతరం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 6 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు..



పోలింగ్ కేంద్రాలకు పయనమైన సిబ్బంది

వారికి టోకెన్‌లు ఇచ్చి ఓటు వేసే హక్కును కల్పిస్తారు. ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య జీపీఎస్‌తో కూడిన వాహనాల్లో కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు తరలిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి జూన్ 4వ తేదీ కౌంటింగ్ నిర్వహిస్తారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 357 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు లోకేషన్లలో మూడు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 21 లోకేషన్లలో 64 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటి పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది పోలీసులతో పహారా కాసేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లతో పరిశీలన చేయించడంతోపాటు వీడియోగ్రఫీ తీయిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లడానికి సిద్ధం చేసిన వాహనాలు

మోడల్ పోలింగ్ స్టేషన్లు అదరహో!



మోడల్‌గా గడివేముల 308 పోలింగ్ కేంద్రం



పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

గడివేముల: గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నిక కమిషన్ పలు పోలింగ్ కేంద్రాలను పండుగ వాతావరణం ఉట్టి పడేలా తీర్చిదిద్దాయి. ఓటర్లు కేంద్రంలోకి అడుగుపెట్టే ముందు సంబరమాశ్చర్యానికి గురికావాల్సిందే. గడివేములలోని 308 కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఆదివారం ఏర్పాట్లు చేశారు. పూలు, మామిడి ఆకులు, అరటి చెట్లతో పాటు బెలూన్స్‌తో స్వాగతతోరణాలు కట్టారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రం వద్ద ఓటరు సెల్ఫీ బోర్డును ఏర్పాటు చేశారు. తాగునీటి, మందులు అందుబాటులో ఉంచారు. ఈ కేంద్రంలో 829 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఓటర్లకు ఆహ్వానం

పాణ్యం: మండలంలోని ఎస్. కొత్తూరు గ్రామంలోని 340 పోలింగ్ కేంద్రాన్ని అధికారులు కొబ్బరి మట్టలు, బెలూన్లతో సుందరంగా అలంకరించారు. ఓటర్లకు స్వాగతం పలికేలా బ్యానర్లు ఏర్పాటు



సి.బెళగల్‌లో ఓటర్లకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసి బ్యానర్లు

చేశారు. ఈ కేంద్రంలో మొత్తం 1,134 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో స్త్రీలు 600, పురుషులు 534 మంది ఓటర్లు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న సి.బెళగల్ పోలింగ్ కేంద్రం

సి.బెళగల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 145వ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సుందరంగా అలంకరించారు. ఓటర్లను ఆకర్షించేలా స్వాగత తోరణాలు, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. షామియానాలతో నీడ సౌకర్యం కల్పించారు.



పాణ్యంలోని ఎస్.కొత్తూరు పోలింగ్ కేంద్రం



ఓటర్లకు స్వాగతం పలికేలా బ్యానర్లు

కుళాయిలు చోరీ

హొళగుంద: చెత్త కాగితలు ఏరుకునే మహిళలు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుళాయిలను చోరీ చేశారు. మధ్యాహ్నం ముగ్గురు మహిళలు కళాశాల ఆవరణంలోకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన విలువైన 11 కుళాయిలను విప్పుకుని వెళ్లారు. కొద్ది సేపటికే అక్కడికెళ్లిన వాచ్‌మెన్ లక్ష్మన్న మహిళలను గుర్తించి పోలీసులుకు పట్టించాడు. పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కుళాయిలు

విచారించి మహిళల నుంచి కుళాయిలను స్వాధీనం చేసుకుని కళాశాల సిబ్బందికి అప్పజెప్పారు.

ప్రశాంత ఎన్నికలే ప్రధాన లక్ష్యం

ఓర్వకల్లు: మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. పాలకొలను, పూడిచెర్ల, గుట్టపాడు, హుసేనాపురం గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. అలాగే ఉయ్యాలవాడ, శకునాల, కేతవరం, భైరాపురం, కాల్వ, బ్రాహ్మణపల్లె గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రశాంత ఎన్నికలే ప్రధాన లక్ష్యంగా మండలంలో 104 మంది భద్రతా సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఆదర్శ పోలింగ్ కేంద్రంగా గుర్తించినట్లు తెలిపారు. మండలంలో పురుష ఓటర్లు–23,639, స్త్రీలు–25,001 మొత్తం 48,604 మంది తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నట్లు తెలిపారు.

గట్టి బందోబస్తు

గూడూరు: మండలంలోని 275 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ తెలిపారు. మహిళా ఓటర్లు 44020 మంది, పురుషులు 36843 మంది, ఇతరులు 11 మంది ఉన్నారని చెప్పారు. పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ హనుమంతప్ప పరిశీలించారు. గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



సిద్ధమైన ఓర్వకల్లు జెడ్పీ హైస్కూల్



గూడూరులోని మోడల్ పోలింగ్ స్టేషన్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ హనుమంతప్ప

టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకు కోత

- ఆర్‌యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటికి కోత విధిస్తారని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు పలు రకాల నిబంధనలు పెట్టి పేదలకు అందకుండా చేస్తారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ప్రకటించిన నిరుద్యోగ భృతి గురించి నిరుద్యోగులను అడిగితే చెబుతారన్నారు. సాధ్యం కాని అనేక హామీలను మేనిఫెస్టోలో చేర్చి సూపర్ సిక్స్ అంటు ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబును నమ్ముకుంటే అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నవరత్నాల పేరిట అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి అమలు చేస్తామని చెప్పారన్నారు.